


పండగ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని గొల్లపల్లిలో మే 1, 2, 3 తేదీల్లో జరిగే దాడితల్లి అమ్మవారి పండగ ఏర్పాట్లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు పరిశీలించారు. రోడ్లు, డ్రెయిన్లు పరిశుభ్రంగా ఉండాలని, సిరిమాను ఊరేగింపు జరిగే వేళల్లో రోడ్లపై ఎటువంటి అడ్డంకాలూ ఉండరాదని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ మురళీకృష్ణారావు

3,513 మంది ఇళ్ల స్థలాల తిరస్కరణ



ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాని గుర్లమండలం కోట గండ్రేడు లేఅవుట్

- శాశ్వత మైగ్రేషన్ పేరిట 686 పట్టాలు రద్దు
- కోర్టు కేసులతో మరో 1925మంది దూరం
- ధ్రువీకరణ పత్రాలు లేవంటూ 516 మందిపై వేటు
- జిల్లాలో ప్రజాప్రతినిధుల నిర్వాకం

తమకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలు నివాస యోగ్యానికి ఏమాత్రం పరినికిరావంటూ జిల్లాలో 3,513 మంది తిరస్కరించారు. మరో 1925 మందికి కేటాయించిన స్థలాలు కోర్టు వివాదంలో ఉండడం వల్ల ఆయా లబ్ధిదారులు దరిచేరలేక పోయారు. వారసత్వ ధ్రువీకరణ పత్రాలు లేవంటూ 516మంది లబ్ధిదారులపై అధికార యంత్రాంగం వేటు విధించింది. మరో 686 మంది శాశ్వతంగా వలసపోయారంటూ పట్టాలు రద్దుచేశారు. మొత్తంగా జిల్లాలో మొత్తం 6,640మంది ఇళ్ల పట్టాలకు దూరమయ్యారు. వీరిలో సుమారు 5వేల మంది పేదలు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్వాకం వల్లే నష్టపోవాల్సి వచ్చింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పేరిట ప్రభుత్వం పేదలకు ఇళ్ల మంజూరు చేసిన విషయం విధితమే. దాదాపు దరఖాస్తులు అందిన అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఈ ప్రక్రియ సాగింది. జిల్లా వ్యాప్తంగా 651 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. భూమి లేని చోట కొనుగోలు చేశారు. ఇందుకోసం రూ.కోట్లు ఖర్చుచేశారు. ఈ లేఅవుట్లలో చాలా వరకు భూగర్భజలాలు అందుబాటులో లేకపోవడం, కొండలు, గుట్టలు కావడం, కనీసం గృహ నిర్మాణ సామగ్రి కూడా తీసుకెళ్లేందుకు అవకాశం లేకపోవడం వంటి కారణాలతో ఆయా స్థలాలను తీసుకునేందుకు ముందుకు రాలేదు. చీపురుపల్లి నియోజకవర్గం మెరకముడిదాం మండలం బుదరాయవలస, జి.మర్రివలస, ఉత్తరావల్లి తదితర పంచాయతీల్లో అత్యధికంగా 916మంది లబ్ధిదారులను ఇళ్ల స్థలాలను తిరస్కరించారు. గుర్ల మండలం పకీరుకిత్తలి, పాలవలస, రాగోలు, వల్లాపురం గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. బొబ్బిలి నియోజకవర్గం బాడంగి మండలంలో 13 లే అవుట్లు ఏర్పాటు చేయగా, అందులో కోటిపల్లి సహా ఆరువేల అవుట్లలో 134 మంది ఇళ్ల స్థలాలను తిరస్కరించారు. నెల్లిమర్ల నియోజకవర్గం పూసపాటిరేగ మండలంలో చోడమ్మ అగ్రహం, గోవిందపురం, ఎల్పి పాలెం, పేరాపురం, కొల్లాయివలస, కొవ్వాడ, పసుపాం లేఅవుట్లలో ఒక్కరు కూడా ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రాలేదు. దీంతో, ఈ ఏడు లేఅవుట్లను రద్దు చేయనున్నట్టు అధికార యంత్రాంగం చెబుతోంది. ఇలా జిల్లాలోని మొత్తం 26మండలాలకు గాను గజపతినగరం, రామభద్రపురం మినహా మిగిలిన అన్ని మండలాల్లోనూ స్థలాలు తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో అత్యధికంగా రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గంలోనే సుమారు 1045మంది తిరస్కరించడం గమనార్హం. దీన్నిబట్టి జిల్లా వ్యాప్తంగా స్థలాల కొనుగోలులో పాదర్శకత పాటించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కోర్టు కేసుల కారణంగా 12మండలాల్లో లబ్ధిదారులు స్థలాలకు నోచుకోలేదు. వీరంతా కోర్టు వివాదాలు లేకుండా, నిర్మాణానికి అనుగుణమైన స్థలాలు ఎప్పుడు ఇస్తారా? అని ఎదురు చూస్తున్నారు.

పకడ్బందీగా సిఎం సభకు ఏర్పాట్లు

సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్, జెడ్పి చైర్మన్

ప్రజాశక్తి-భోగాపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సిఎం సభ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్, జెడ్పి చైర్మన్‌తో పాటు ఎస్‌పి ఎం.దీపిక, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెసి మయూర్ అశోక్ పరిశీలించారు. హెలిపాడ్, అక్కడినుంచి సభాస్థలికి చేరుకొనే మార్గాన్ని, శిలాఫలకాలు, భూమిపూజ, జిఎంఆర్ క్స్పిరియన్స్ సెంటర్, వేదిక, బారికేడింగ్, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. రాష్ట్రానికే తలమానికమైన భోగాపురం విమానాశ్రయం, మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపే ఫిష్ లాండింగ్ సెంటర్, సాగు తాగు నీటి అవసరాలను తీర్చే ప్రతిష్టాత్మక తారకరామ తీర్థసాగర్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నందున, వాటి విశిష్టతలు తెలిపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. పర్యటనలో జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్ కుమార్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ట్రాన్స్‌కో ఎస్ఇ నాగేశ్వరావు, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి, ఉద్యాన శాఖ డిడి జమదగ్ని, డిపిఒ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి తదితర అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జెడ్‌పి చైర్మన్

విస్తృత బందోబస్తు : ఎస్‌పి

విజయనగరం : భోగాపురంలో నూతనంగా నిర్మించనున్న విమానాశ్రయ నిర్మాణ పనులకు మే 3న శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనకు చేపట్టనున్న బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు తలెత్తకుండా అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. జాతీయ రహదారికి దగ్గరలో హెలిప్యాడ్, మీటింగు స్థలం ఉన్నందున జాతీయ రహదారిపై వాహనాల రాక, పోకలకు ఎటువంటి విఘాతం కలుగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకుగాను ప్రత్యేకంగా ట్రాఫిక్ రెగ్యులేషన్, పార్కింగు స్థలాల వద్ద ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని, అధికారులను నియమించడంతో పాటు, పర్యవేక్షించేందుకు ఉన్నత స్థాయి పోలీసు అధికారిని నియమించామన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనేందుకు వచ్చే ముఖ్య వ్యక్తుల వాహనాలకు, ప్రజలకు వేరు వేరుగా పార్కింగు స్థలాలను కేటాయించామన్నారు. సభా స్థలం వద్ద బ్యారికేడింగు పటిష్టంగా ఏర్పాటు చేసే విధంగా సంబంధిత ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించాల్సిన ప్రాంతాలను, సభా స్థలం, హెలిప్యాడ్, పార్కింగు స్థలాలను సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా సందర్శించాలని ఎస్‌పి సూచించారు. సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్‌పి బి.మోహనరావు, ట్రాఫిక్ డిఎస్‌పి ఎల్.మోహన రావు, డిటిసి డిఎస్‌పి వీరకుమార్, ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



స్థానిక మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

రూ.60 లక్షలతో ప్రత్యేక పైపులైన్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని రాజీవ్‌నగర్ కాలనీకి రూ.60లక్షలతో దాసన్నపేట వాటర్ ట్యాంక్ నుండి ప్రత్యేక పైప్ లైన్ల ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వెల్లడించారు. శుక్రవారం రాజీవ్ నగర్ కాలనీ ప్రాంతంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. లైట్లు వేయాలని, విద్యుత్ వైర్లపై వేలాడుతున్న చెట్టు కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరగా సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందన్నారు. గురువారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ వ్యవహార శైలి సక్రమంగా లేకపోవడంతో సస్పెండ్ చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. దాసన్నపేట వాటర్ ట్యాంక్ నుండి ప్రత్యేక పైప్ లైన్లు వేసే కార్యక్రమానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, స్థానిక కార్పొరేటర్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై వాగ్వివాదం

రూ.18.47 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో తాగునీటి సరఫరాపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య విమర్శ ప్రతివిమర్శలు చోటు చేసుకున్నాయి. శుక్రవారం మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అంశాల వారీగా ప్రస్తావన జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు కర్రోతు రాధామణి మాట్లాడుతూ నగరంలో తాగునీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో తీసుకున్న చర్యలు, తాగునీటి ప్రాజెక్టుల విషయమై సమావేశంలో వివరించాలని అధికారులను కోరారు. దీంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. ప్రతిపక్ష సభ్యురాలి ప్రశ్నలకు స్పందిస్తూ అధికారపక్ష సభ్యులు ధ్వజమెత్తారు. తాగునీటి పంపిణీ విషయమై టిడిపి సభ్యులకు మాట్లాడే హక్కే లేదని 15వ డివిజన్ కార్పొరేటర్ అల్లు చాణక్య అన్నారు. గతంలో ప్రభుత్వంలో తాగునీటి ఇబ్బందులతో అల్లాడిన ప్రజలు 2 వేల ఖాళీ బిందెలతో కార్యాలయం ముందు ధర్నా చేసిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. రూ.200కే కుళాయి కనెక్షన్లు ఇప్పిస్తామని ఖాళీ గొట్టాలను విడిచిపెట్టిన చరిత్ర టిడిపిదని విమర్శించారు. నగరంలో రోజు విడిచి రోజు నీటి పంపిణీ జరగటంలేదని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని మరో కార్పొరేటర్ సుంకరి నారాయణస్వామి సవాల్ విసిరారు. ఇఇ కె.శ్రీనివాసరావు సమాధానం ఇస్తూ అమృత పథకం కింద అనేక వాటర్ ట్యాంకులను నిర్మించామని, నీటి పంపిణీ కెపాసిటీని పెంచి రోజు విడిచి రోజు నగరమంతా నీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కోఆప్షన్ సభ్యులు ఆసపు వేణు మాట్లాడుతూ నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.





సమావేశానికి హాజరైన మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు

కమిషనర్ శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యుల సహకారం, సిబ్బంది కృషి ఫలితంగా నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటివరకు రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.45 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సాధారణ సమావేశంలో 30 అంశాలలో రూ.18.47 కోట్లతో అభివృద్ధి పనుల కు ఆమోదం తెలిపారు. దాసన్నపేట డంపింగ్ యార్డు నుంచి ఫోర్ట్ సిటీ స్కూల్ మీదుగా జమ్ము వరకు 100, 80 అడుగుల రోడ్డు రూ.4 కోట్లతో, అర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి కనపాక, అయ్యన్న పేట, పాల్ నగర్ వరకు 80 అడుగులు రోడ్డు విస్తరణకు రూ.2.85 కోట్లతో అభివద్ది చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

రూ.4.71 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

అనంతరం జరిగిన అత్యవసర సమావేశంలో 11 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. పలు డివిజన్లలో 55 రోడ్డు, కల్వర్టు,కాలువ పనులకు రూ. 4.60 కోట్లతో ఆమోదం తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతి దేవి, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని కార్పొరేటర్లు

సమావేశంలో వార్డు సమస్యలు,ప్రజలు సమస్యలు చర్చించి నగరాభివృద్ధికి తోడ్పడాల్సిన కౌన్సిల్ సమావేశం ఏక పక్షంగా జరగడంతో ఎటువంటి చర్చ లేనప్పుడు, కేవలం కూర్చొని వచ్చే యడానికి ఎందుకు వెళ్ళాలి అనుకుంటున్నట్లు ఉన్నారు మన నగర పాలక సంస్థ కౌన్సిల్ సభ్యులు. అందుకు గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం ఉదాహరణ. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సిల్ సమావేశం 11.20 నిమిషాలకు ప్రారంభం అయింది.ఎప్పటికీ కోరం సరిపడే సభ్యులు మాత్రమే రావడం జరిగింది.దీంతో 20 నిమిషాలు ఆలస్యంగా సమావేశం జరగడంతో పాటు ఎజెండా పై చర్చ లేకపోవడంతో సభ్యులలో కూడా ఆసక్తి ఉండటం లేదు.ఒక వేళ సమావేశానికి వచ్చినా సంతకం పెట్టి వెళ్లి పోయినా వారు కొందరు అయితే ఒకరు ఇద్దరు సభ్యులు మాత్రమే మాట్లాడుతుండటంతో మిగిలిన సభ్యులు విని వెళ్లిపోవడం కనిపిస్తుంది. మరో వైపు కౌన్సిల్ లో చర్చించినా ఉపయోగం లేదు అనే ధోరణిలో కూడా కొంత మంది సభ్యులు అంటున్నారు. సమావేశాలు మమ అనిపించేసి వెళ్లిపోవడం మినహా ,పెట్టిన ఎజెండాను ఆమోదించడానికి తప్ప రావాల్సి వస్తుందనే అభిప్రాయం కొంతమంది సభ్యులలో వ్యక్తం అవుతుంది. కనీసం సమావేశానికి పూర్తి స్థాయిలో వచ్చి చర్చ జరిగితే కౌన్సిల్ సమావేశానికి అర్థం ఉంటుందనే అభిప్రాయం కూడా వ్యక్తం అవుతుంది. ఇక నుంచి అయినా సమయానికి హాజరై,చర్చకు అవకాశం ఇస్తానని ఆశిద్దాం.

సిఎం పర్యటన వివరాలు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విజయనగరం జిల్లా పర్యటన ఖరారైంది. భోగాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. మే 3వ తేదీ ఉదయం 9.20గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడ 9.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి భోగాపురం మండలం రావివలసకు 10గంటలకు చేరుకుంటారు. హెలీప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు స్వాగతం పలకనున్నారు. అనంతరం అక్కడి నుంచి 10.15గంటలకు జిఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు చేరుకొని పరిశీలిస్తారు. 10.30 గంటలనుంచి 10.55 వరకు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి, చింతపల్లి ఫ్లోటింగ్ జెట్టీ, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు బ్యాలెన్సు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 10.55 గంటలకు సవరవిల్లిలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. 11 నుంచి 12.20 గంటల వరకు సభలో ఉంటారు. 12.30 నుంచి 1.15 గంటల వరకు స్థానిక నాయకులతో మాట్లాడు తారు. 1.20గంటలకు సవరవిల్లి నుంచి ఎ.రావివలస చేరుకొని విశాఖ వెళ్తారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

పోస్టల్ ఆర్‌డిలకు అనుమతి

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 27న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన ఆర్‌డిలకు అనుమతించాలి అనే వార్తకు తపాల శాఖ స్పందించింది. ఏప్రిల్ నెలకు సంబంధించి ఆర్‌డి డిపాజిట్లను పోస్టల్ ఆర్‌డి ఏజెంట్ల నుండి డిపాజిట్లను తపాల శాఖ అనుమతించిందని పోస్టల్ ఆర్.డి. డిపాజిట్ ఖాతాదారులు చిప్పాడ ప్రభుదాస్, దామెర సత్యనారాయణరావు తెలిపారు. ఈ మేరకు హర్షం వ్యక్తం చేశారు.

తప్పని డోలి కష్టాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్ర్యం సిద్ధించి 75 దశాబ్దాలు గడిచినా మన్యం ప్రాంతంలో గిరిజనులకు వైద్య సేవలు అందని ద్రాక్ష గానే మారాయి. నేటికీ చాలా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం డోలి కష్టాలు తప్పడం లేదు. స్థానికంగా వైద్య సేవలు కరువవ్వడంతో కిలోమీటర్ల మేర కాలినడకన డోలి సాయంతో సమీపంలోని ఆస్పత్రులకు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఇందులో భాగంగానే మండలంలోని లుంబేసు పంచాయతీ దెరుగండలో పత్తిక చిరంజీవి భార్య సుశీల గర్భిణీ. ఈనెల 22న తీవ్ర నొప్పులు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఎటువంటి సదుపాయం లేక ఇంటి వద్దేనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆరోగ్య పరీక్షల నిమిత్తం శుక్రవారం తల్లీబిడ్డను డోలి సాయంతో తాడికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలందించారు. ఏజెన్సీలో డోలి కష్టాలు నిత్యకృత్యంగా మారుతున్న అధికారులు, పాలకుల్లో మాత్రం చలనం ఉండడం లేదు. ఇప్పటికైనా గిరిజనల కష్టాలను గుర్తించి కొండలపైన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.



బాలింతను డోలి కట్టి తీసుకెళ్తున్న గిరిజనులు



విజయనగరంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

గ్రాడ్యుటీ చెల్లించాలని అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారయి అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ విజయనగరం అర్బన్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు శుక్రవారం సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ దేశంలో చాలా రాష్ట్రాల్లో అక్కడ ప్రభుత్వాలు గ్రాడ్యూటీ చెల్లిస్తున్నాయని అన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సూపర్వైజర్ మేరీ వనితకు వినతి అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కెపి శివలక్ష్మి, సెక్టార్ లీడర్ సునీత అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని గజపతినగరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్వాడీలు ధర్నా చేశారు. అనంతరం పిఒ, సూపర్‌వైజర్లకు వినతులు అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు పి.జ్యోతి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లను తప్పనిసరిగా కార్మికులుగా పరిగణించాలని కోరారు. కనీస వేతనాలు, ఇతర చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్‌చేశారు. పెన్షన్‌తో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాములమ్మ, సన్యాసమ్మ, సుజాత, వాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

1 నుంచి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం

శృంగవరపు కోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మే ఒకటో తేది నుంచి వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో 8 నుండి 15 ఏళ్ల బాలురు, బాలికలు ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు..

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

'గడపగడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి- మెంటాడ

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైసిపిని గెలిపిస్తాయని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం మండలంలోని జక్కువ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారు సాంకేతిక లోపాలు వల్ల సంక్షేమ పథకాలు అందకపోతే అటువంటి వారిని గుర్తించి, అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను పూలమాలలతో సత్కరించి బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, లెంక రత్నాకర్ నాయుడు, రైతు సలహా మండలి మండల అధ్యక్షుడు లచ్చిరెడ్డి అప్పలనాయుడు, సర్పంచ్ సత్యవతి, మెంటాడ, జక్కువ పిఎసిఎస్‌ల అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, రెడ్డి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

బొండపల్లి : సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల దీవెనలే ప్రభుత్వానికి శ్రీరామరక్షని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. శుక్రవారం మండలంలో తామటాడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వి.ముత్యాలు నాయుడు, ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు రాపాక సూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

30న రాజాం రచయితల వేదిక సమావేశం

ప్రజాశక్తి- రాజాం

ఈ నెల 30న స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక సమావేశం నిర్వహిస్తున్నట్లు వేదిక నిర్వాహకులు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త నల్ల రవికుమార్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ప్రముఖ రచయిత పిల్లా తిరుపతిరావు '1818 దీర్ఘ కవిత – పరిశీలన' అనే అంశంపై ముఖ్య ప్రసంగం చేస్తారు. అనంతరం స్వీయ రచనా పఠనం జరుగుతుంది. సాహితీవేత్తలు, రచయితలు, సాహిత్య అభిమానులు అందరూ హాజరు కావాలని రంగనాథం కోరారు.

రైలు ఢీకొని కూలీ మృతి

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని గరుడబిల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం రైలు ఢీకొని ఉపాధి కూలీ రాములమ్మ మృతిచెందింది. ఉపాధి హామీ పనుల కోసం పాపయ్యచెరువుకు వెళ్లే క్రమంగా కూలీలంతా రైల్వే ట్రాక్ దాటుతున్నారు. ఇంతలో రైలు రావడంతో మిగతా కూలీలు పరుగెత్తి ట్రాక్‌దాటి వెళ్లిపోయారు. రాములమ్మ ట్రాక్ దాటలేకపోవడంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందింది. రాములమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గ్రామాల్లో సమస్యలకు సత్వర పరిష్కారం

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి- బొబ్బిలిరూరల్

గ్రామాల్లో సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి శంబంగి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దిబ్బగుడ్డివలస, చింతాడ, మెట్టవలస, కారాడ, నిమ్మలపాడు, శివడవలస తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. మెట్టవలస సర్పంచ్ గ్రోత్‌సెంటర్లో ఏర్పాటు చేసిన కర్మాగారాల్లో నుంచి కాలుష్యం తమ గ్రామాల్లోకి వస్తుందని ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఏయే కర్మాగారాల వల్ల కాలుష్యం వస్తుందో లిఖితపూర్వకంగా ఇవ్వాలన్నారు. ఎం.బూర్జివలస సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామానికి దగ్గరలో రైల్వే గేటు వల్ల గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని, 108 వాహనానికీ ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్‌పి స్పందిస్తూ ఆర్‌యుబి ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, ఎంపిడిఒ ఎ.భాస్కర్రావ్, తహశీల్దార్ ఎన్.రాజారావు, వైస్ ఎంపిపి శంకర్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పిఎంకె రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

బీమా చెక్కు అందజేత

ఇటీవల జగన్నాథపురం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మరణించిన కింతలి రవి భార్య కనకానికి వైఎస్‌ఆర్ బీమా నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి అందజేశారు.



వినతి అందిస్తున్న గిరిజనులు

అటవీ భూములకు హక్కులు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలో గిరిజనులు సాగుచేస్తున్న పోడు, సీలింగ్, బంజరు భూములకు పట్టాలిచ్చి గిరిజనులను ఆదుకోవాలని శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘ జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తామరాపల్లి సోములు మాట్లాడుతూ గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. పట్టాలు లేనందున రైతు భరోసా అందడం లేదని, బ్యాంకు రుణాలు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.



ఉమను అభినందిస్తున్న ఎంపిపి ప్రమీల, జెడ్‌పిటిసి అప్పలనాయుడు

విద్యార్థినికి అభినందన

ప్రజాశక్తి- గుర్ల

గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన మునకాల ఉమను ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు అభినందించారు. కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపిడిఒ బి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకన్నపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని వెంకన్నపేటలో ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో భాగంగా మిమ్స్ ఆస్పత్రి సహకారంతో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 110 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ఎన్.షణ్ముఖరావు పాల్గొన్నారు.



వంగర.. కుటుంబ సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

కుటుంబ సర్వే వేగవంతం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

గ్రామాల్లో కుటుంబ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ జి.గిరిబాల సూచించారు. శుక్రవారం మండలంలోని అలుగోలు, గుషిని గ్రామాల్లో పర్యటించి చిల్డ్రన్ ఔట్ రీచ్ సర్వే, సమ్మర్ క్రాష్ ప్రోగ్రాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సమ్మర్ క్రాష్ ప్రోగ్రాంలో తాగునీటి బోర్లు బాగు చేయించుకోవాలని తెలిపారు. పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి హెచ్.భానోజీరావు, కార్యదర్శి కెల్ల రాంజీరావు పాల్గొన్నారు.

వంగర : మండలంలోని మడ్డువలసలో చేపడుతున్న సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేను ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సర్వేలో సచివాలయాలు ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సేవల గూర్చి ఇంటింటికీ వెళ్లి తెలియజేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ శిబిరానికి వెళ్తున్న వాలంటీర్లు

కొండకరకాంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ కొండకరకాంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామస్తులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో సర్పంచ్ రాంబాబు, హెచ్ఎం సతీశ్వరరావు ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. వాలంటీర్లను సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి. శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎన్.సతీష్ కుమార్ అభినందించారు.


కార్యదర్శికి షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని హుస్సేన్ పురం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం పాలకొండ డిఎల్‌డిఒ వి.గోపాలకృష్ణ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సచివాలయ కార్యదర్శి షణ్ముఖరావు పనితీరు బాగోలేదని, విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో పాటు పివిటిజి సర్వేలో కూడా వెనుకబడి ఉన్నట్లు గుర్తించి షోకాజు నోటీసిస్తున్నట్లు ఆయన తెలిపారు.



గుర్ల.. పార్టీలో చేరిన టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున



డెంకాడ.. మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు

చీపురుపల్లి అభివృద్ధికి బొత్స ఏంచేశారు?

టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-గుర్ల

నాలుగేళ్లుగా చీపురుపల్లి స్వరూపాన్ని మార్చడానికి మంత్రి బొత్స సత్యనారాయణ ఏం చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున ప్రశ్నించారు. మండలంలో దమరసింగి గ్రామంలో నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు తలలు పట్టుకుంటున్నారని చెప్పారు. పాలకులు ప్రజల జీవన ప్రమాణాలను పెంచే విధంగా పరిపాలన సాగించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతిఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం సామాన్యులపై మోపుతున్న భారాలను వివరించారు. అనంతరం పలువురు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసి నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు, కురిమినెల్లి బంగారునాయుడు, గొర్లి రామునాయుడు, కెల్ల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

భోగాపురం : వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. శుక్రవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మండలంలోని తూడెం, కౌలువాడ పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత దుర్భరమైన పరిపాలన సాగుతుందని, అభివృద్ధి అన్నమాటే లేదని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, కోరాడ తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : మండలంలోని డి.కొల్లం, గుణుపూరుపేట గ్రామాల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, గ్రామ అధ్యక్షులు మీసాల లక్ష్మునాయుడు, పైల రామారావు, కలిశెట్టి అప్పలనాయుడు, పిన్నింటి ఆదినారాయణ, కరణం రమణ, బుజ్జి, కలిశెట్టి త్రినాథ్ పాల్గొన్నారు.

చదువులో రాణించాలంటే

మేధస్సుకు పదును పెట్టాల్సిందే

సెంచూరియన్ యూనివర్సిటీ విసి జిఎస్ఎన్ రాజు



వక్రీభవనం గురించి వివరిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.చంద్రశేఖరరావు

ప్రజాశక్తి-నెల్లిమర

విద్యార్థులు చదువులో రాణించాలంటే మేధస్సుకు పదునుపెట్టాలని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు సూచించారు. శుక్రవారం సెంచూరియన్ యూనివర్సిటీలో నిర్వహించిన 'కాంతి అధ్యయనంపై వినూత్న ప్రయోగాలు' అనే సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువులో పరుగులు తీస్తేనే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరన్నారు. రిజిస్ట్రార్ పిఎస్‌వి రమణారావు మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు విద్యార్థుల ఉన్నతికి దోహదపడతాయన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం గాకుండా ప్రయోగాత్మకంగా అంశాలను అధ్యయనం చేయాలన్నారు. అనంతరం పలు అంశాలను ప్రయోగపూర్వకంగా చేసి చూపించారు. అనంతరం చంద్రశేఖరరావును విసి ఘనంగా సత్కరించారు. సదస్సులో ప్రొఫెసర్ కెవిజి కృష్ణమూర్తి, డీన్ ప్రొఫెసర్ ఎం.లక్ష్మీనరసింహాచార్యులు, అసోసియేట్ డీన్ డాక్టర్ సన్నీడియోల్, రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతమ్మ, విభాగాధిపతి ఎ.సతీష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ్‌బాబు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు సచివాలయాన్ని శుక్రవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎల్ పట్నాయక్ పరిశీలించారు. ఈ పరిశీలనలో సిటిజన్ ఔట్ రీచ్ తదితర అంశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పూడిక తీస్తున్న కార్మికుడు

చురుగ్గా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వేపాడ

వీలుపర్తి సచివాలయ పరిధిలోని రాయుడుపేట, దుంగాడ, బొర్రావలస గ్రామాలలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి ఎం.అనూష ఆధ్వర్యాన గ్రీన్‌అంబాసిడర్లు కాలువల్లో పూడికలు తొలగిస్తున్నారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. సర్పంచ్ సేనాపతి లీల పనులను పర్యవేక్షిస్తున్నారు.

నీటి నిల్వలే దోమలకు ఆవాసం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లు పెట్టి పెరిగే అవకాశాలు ఉన్నాయని, నీరు నిల్వ లేకుండా చూడాలని శృంగవరపుకోట సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.ఆనందయ్య అన్నారు. అఫీషియల్ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వంద గృహాల వరకు ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ పి.రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ శంకర్ పాల్గొన్నారు.



ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వైవి రమణ

రావాడలో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రావాడ గ్రామంలో లేగ దూడల ప్రదర్శన జరిగింది. పాడి రైతులు కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ద్వారా జన్మించిన ఆడ దూడలను ప్రదర్శించారు. 57 ఆడ లేగ దూడలు ప్రదర్శనకు వచ్చాయి. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వై.వి.రమణ పాల్గొని, ఉత్తమమైన మూడు దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిడి ఎ.రామచంద్ర రావు, పశుగణాభివృద్ధి సంస్థ డిడి దామోదరరావు, సర్పంచ్ ఎ.పైడినాయుడు, భోగాపురం ఎడి ఉమాశంకర మహాపాత్రో, పశు వైద్యాధికారులు శ్రీలక్ష్మి, కమల కుమారి, రామరాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ



తన ఖాళీ స్థలం ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారంటూ చూపిస్తున్న శ్రీనివాసరావు

తమ ఇంటి స్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న వెల్దూటి చిన్నపై చర్యలు తీసుకోవాలని మండలంలోని కుమిలి గ్రామానికి చెందిన తూతిక శ్రీనివాసరావు కోరారు. ఇప్పటికే ఈ విషయమై విజయనగరంలో స్పందనతో పాటు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం, పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దేవాంగువీధిలో గ్రామకంఠంలో సర్వే నంబర్ 354/1లో పెంకుటిల్లు ఉందన్నారు. తన ఇంటిని ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో తాము లేని సమయంలో వెల్దూటి చిన్న ఆక్రమించి పునాదివేసి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. ఎంపిడిఒ రామారావు స్పందించి, నిర్మాణం ఆపాలని ఆదేశించినా ఆక్రమణదారుడు పట్టించుకోలేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి తన స్థలాన్ని కాపాడాలని, సరిహద్దులు చూపించాలని కోరారు.

చైను స్నాచింగ్ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కోట సత్యవతి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఆమె మెడలో పుస్తుల తాడును తెంపుకొని పోయిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారినుంచి నుంచి పుస్తెల తాడును రికవరీ చేసినట్లు 2వ పట్టణ సిఐ సిహెచ్.లక్ష్మణరావు తెలిపారు. ఆరోజు ఈ సంఘటనను గమనించిన స్థానికులు వారిని పట్టుకొనేందుకు ప్రయత్నంలో గుర్తించిన మోటారు సైకిల్ నెంబరును పోలీసులకు అందించగా, పోలీసులు శుక్రవారం దాసన్నపేట వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఆ మోటారు సైకిలు నంబరును గుర్తించి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు.

గుర్ల మండలం, చింతలపేటకు చెందిన గరుగుబిల్లి పవన్ కుమార్, యడ్ల శివను అరెస్టు చేసి, వారి వద్ద నుండి తులం న్నర బంగారు పుస్తుల తాడు, మోటారు సైకిలును రికవరీ చేసి, నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎఎస్ఐ పైడితల్లి, హెడ్ కానిస్టేబులు టివిఆర్‌కె ప్రసాద్, కానిస్టేబులు వానులను సిఐ అభినందించారు.

1న వాహనాల వేలం

రామభద్రపురం : గతంలో అక్రమ రవాణాకు వినియోగించిన ద్విచక్ర వాహనాలకు మే ఒకటో తేదిన స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గత వేలం పాటలో నిర్ణీత ధర రాని కారణంగా మిగిలి ఉన్న 2 బైకులు, ఒక టివిఎస్ వాహనాలకు వేలం నిర్వహిస్తామని చెప్పారు.

జాబ్ కార్డులు పొందాలని ర్యాలీ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఉపాధి హామీలో కార్మికులుగా పనిచేసేందుకు విధిగా జాబు కార్డుల పొందాలని అవగాహన కల్పిస్తూ ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి హామీ అమల్లో విజయనగరం జిల్లా ముందంజలో ఉందన్నారు. జాబ్‌కార్డుకు దళిత, గిరిజనులు దరఖాస్తు చేసిన మూడు రోజుల్లోనే మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎపిఒ రమ్య మాట్లాడుతూ కుటుంబంలో ఒకే ఆధారాలతో ఉన్న జాబ్ కార్డు కలిగిన వారు విధిగా పొందేందుకు సదావకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.

ఉపాధి హామీని వినియోగించుకోవాలి

గజపతినగరం : ఎస్సి, ఎస్టిలు ఉపాధి హామీ చట్టాన్ని వినియోగించుకోవాలని ఎంపిడిఒ పప్పు సుదర్శన్, ఎపిఒ సిహెచ్.రామారావు కోరారు. శుక్రవారం మండలంలోని మరుపల్లి, పాతబగ్గాం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి కుటుంబాలు వంద రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిఎలు సతీష్, రమణ, అప్పలనాయుడు, లేఖిని, ఎఫ్ఎ రమణ, పప్పల గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం.. ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధి సిబ్బంది



లక్కవరపుకోట.. ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధి సిబ్బంది